## క్లుప్తంగా

### ఎంపీకి మాజీ మంత్రి సన్మానం



ఎంపీ రఘురాంరెడ్డితో జానారెడ్డి, రఘువీర్‌రెడ్డి

**ఖమ్మంవన్‌టౌన్:** ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలుపొందిన ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డిని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి సన్మానించారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మంగళవారం సన్మానించిన జానారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఏపీలోనే కాంగ్రెస్ పార్టీ కోసం రామసహాయం కుటుంబం నిబద్ధతతో పనిచేసిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అదనపు కలెక్టర్‌కు వినతి



వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకురాళ్లు

**ఖమ్మం మామిళ్లగూడెం:** ఆశా వర్కర్లకు ప్రతీ నెల జీతాలు చెల్లించాలని కోరుతూ బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యాన మంగళవారం అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌కు వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి పమ్మి అనిత మాట్లాడుతూ.. ఆశా వర్కర్లకు ప్రతీ నెల జీతాలు అందించక పోవడం వలన వారు అనేక ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందన్నారు. వినతి అందించిన వారిలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా నాయకురాలు గోలి ఫణికుమారి, మన్యం నాగమణి, స్వర్ణ, బిందు తదితరులు పాల్గొన్నారు.

### ఆర్‌టీసీ స్థలానికి వేలంలో రూ.46,116



టెండర్‌దారుడికి లీజ్ పత్రాన్ని అందిస్తున్న అధికారులు

**నేలకొండపల్లి:** మండల కేంద్రంలోని ఆర్‌టీసీ(ప్రస్తుత ఫంక్షన్ హాల్) ఉన్న స్థలాన్ని లీజ్‌కు ఇచ్చేందుకు అధికారులు మంగళవారం వేలం నిర్వహించారు. ఈ వేలంలో మొత్తం 10 మంది పోటీ పడగా.. గుండా బ్రహ్మం అనే రియల్టర్ అత్యధికంగా రూ.46,116లకు టెండర్ వేయడంతో ఆర్‌టీసీ అధికారులు ఆయనకు స్థలాన్ని అప్పగిస్తున్నట్లు లీజ్ పత్రాన్ని అందించారు. ఐదేళ్ల పాటు ఆర్‌టీసీ స్థలం లీజ్‌లో ఉండనుండగా.. బస్టాండ్ స్థలాన్ని ప్రయాణికుల సౌకర్యార్థం ఉంచాలన్నారు. ప్రజా సంఘాలు, సామాజిక కార్యకర్తలు ఆందోళన చేసినప్పటికీ ఆర్‌టీసీ అధికారులు లీజ్ వేలం పాట నిర్వహించారు. కాగా, టెండర్ ద్వారా ఆర్‌టీసీకి భారీగా ఆదాయం పెరిగినట్లయింది.

### ట్రాక్టర్ బోల్తా..

ఒకరికి తీవ్ర గాయాలు

**రఘునాథపాలెం:** రఘునాథపాలెంలో ట్రాక్టర్ బోల్తా పడి ఒకరికి గాయాలైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. ఖమ్మం నుంచి మంచుకొండ వైపునకు లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ ట్రక్కు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రక్కుపై కూర్చున్న ఖమ్మం నగరం ఖానాపురానికి చెందిన చెక్కల శంకర్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రుడిని ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

### ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

| కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో) | | ఆకుకూరల కట్టలు (రూ.ల్లో) | |
|---|---|---|---|
| టమాట | 66 | బచ్చలికూర | 4 |
| వంకాయ | 26 | | 20 |
| బెండకాయ | 30 | పాలకూర | 3 |
| పచ్చిమిర్చి | 60 | | 20 |
| కాకర | 78 | చుక్కకూర | 3 |
| బీర | 78 | | 20 |
| దొండ | 48 | తోటకూర | 4 |
| పొట్లకాయ | 40 | | 20 |
| చిక్కుడు | 110 | గోంగూర | 4 |
| గోరుచిక్కుడు | 66 | | 10 |
| క్యాబేజీ | 30 | మెంతికూర | 3 |
| క్యాలీఫ్లవర్ | 26 | | 20 |
| ఆలుగడ్డ | 40 | కొత్తిమీర | 1 |
| చామగడ్డ | 44 | | 50 |
| క్యారెట్ | 54 | పుదీన | 1 |
| క్యాప్సికం | 90 | | 30 |

-ఖమ్మం వ్యవసాయం

# ఆగిన పనులతో అవస్థలెన్నో..



ప్రమాదకరంగా ఉన్న ధంసలాపురం ఆర్‌యూబీ బ్రిడ్జి కోసం తవ్విన గుంత



**నిలిచిపోయిన ధంసలాపురం ఆర్‌యూబీ నిర్మాణ పనులు**

- రూ.16.94 కోట్లు కేటాయించిన గత ప్రభుత్వం
- ప్రమాదకరంగా తవ్వి వదిలేసిన గుంత
- వర్షాకాలంలో మురుగుతో నిండి కంపు కొడుతున్న వైనం
- ఎక్కడ జారి పడతారోనని ఆందోళన
- బ్రిడ్జి ప్రస్తావనపై స్పష్టత కరువు

**ఖమ్మంమయూరిసెంటర్:** ప్రజా రవాణా సౌకర్యం కోసం నగరంలోని 16వ డివిజన్ ధంసలాపురం–అగ్రహారం రైల్వే గేట్ వద్ద ఆర్‌యూబీ (రైల్వే అండర్ బ్రిడ్జి) పనులను 2022 ఏడాది మార్చిలో ప్రారంభించారు. ఆతర్వాత సగం పనులు కూడా పూర్తి చేయకుండా మధ్యలోనే ఆపివేశారు. అర కిలోమీటర్ వరకు గుంతలా తవ్వి వదిలేయడంతో ప్రస్తుతం ఇది ప్రమాదకరంగా మారింది. అగ్రహారం ప్రాంతంలోని రైల్వే గేట్‌కు ఇరువైపులా నివశించే వారు వివిధ పనుల నిమిత్తం ఈ గేటు వద్ద ట్రాక్‌ను దాటుతుంటారు. ఈక్రమంలో కొన్నిసార్లు అందులో పడిపోతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో పాలకులు ఈ పనులు పూర్తి చేయిస్తామని చెప్పినా.. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండిపోయింది. ప్రభుత్వం మారి ఏడు నెలలు కావొస్తున్నా ఈ బ్రిడ్జి పనుల గురించి ప్రస్తావన తీసుకొచ్చే వారు కరువయ్యారు.

**పట్టించుకోని అధికారులు..**

ఆర్‌యూబీ కోసం తవ్విన గుంత ఏళ్ల తరబడి అలానే ఉండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ గుంతలో వర్షాకాలంలో వర్షపు నీరు చేరడం, దానిలో వ్యర్థాలు, ప్లాస్టిక్ కాగితాలు కలవడంతో దుర్వాసన వస్తోంది. ఈ ప్రాంతవాసులకు సమస్యగా మారిన ఈ గుంతను అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆర్‌యూబీ పనులను పూర్తి చేసి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

**గుంత ప్రమాదకరంగా ఉంది..**

గుంత తవ్వి వదిలివేయడంతో ప్రమాదకరంగా ఉంది. ఈ గుంత వెంట నడిచి వెళ్లేవారు, ద్విచక్ర వాహనదారులు ఎక్కడ జారి పడతారోనని ఆందోళన కలుగుతుంది. గతంలో వర్షాకాలంలో గుంతలో పడి గాయాలపాలైన వారు ఉన్నారు. వెంటనే ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలి.

– నారపోగు ప్రభాకర్, స్థానికుడు

**పట్టించుకునేవారు లేరు..**



ప్రజా అవసరాల కోసం ఆర్‌యూబీని నిర్మించేందుకు పనులు ప్రారంభించినప్పుడు సంతోషించాం. కిలోమీటర్ల మేర చుట్టూ తిరిగి వచ్చి, వెళ్లే భారం తగ్గుతుందని భావించాం. పనులు ప్రారంభించినట్లే ప్రారంభించి నిలిపివేశారు. తవ్వి వదిలేసిన గుంతను ఎవరూ పట్టించుకోవడం లేదు.

– కాట్లా పూర్ణ, స్థానికుడు

**ఆదమరిస్తే ప్రమాదమే..**



నిత్యం వందలాది మంది జనం, పశువులు రైల్వే ట్రాక్ మీదుగా ఈ గుంత పక్క నుండే వెళ్తుంటారు. గుంత దాటే వరకు ఆదమరిచి నడిస్తే ప్రమాదమే. గుంత పక్కన ఉన్న మట్టి రోడ్డు సక్రమంగా లేకపోగా.. గుంత చుట్టూ కనీసం రక్షణ చర్యలు చేపట్టలేదు. కర్రలు లేదా స్తంభాలనైనా ఏర్పాటు చేయాలి.

– నాగలక్ష్మి, స్థానికురాలు

**ప్రమాదకరంగా గుంత..**

ధంసలాపురం అగ్రహారం ప్రాంతాల ప్రజలకు సౌకర్యంగా ఉండేందుకు రూ.16.94 కోట్ల వ్యయంతో ఆర్‌యూబీని నిర్మించేందుకు 2021లో శంకుస్థాపన చేశారు. ఈ పనులను 2022 ఏడాది మార్చిలో ప్రారంభించి.. కొద్ది మేర చేసి వదిలిపెట్టారు. దీంతో కొత్తూరు నుంచి ట్రాక్ మీదుగా ధంసలాపురం వెళ్లే మార్గంలోనే ఈ గుంత ఉండడంతో మనుషులు నడిచివెళ్లే సమయాన ఏం ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. వర్షం కురిసినప్పుడల్లా చుట్టూ ఉన్న మట్టి పెల్లలు ఊడి గుంతలో పడడం, వర్షపు నీరు గుంతలోకి చేరి మురుగుగా తయారవుతోంది. అటుగా వెళ్లే గేదెలు, మనుషులు ఎక్కడ పడిపోతారోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.



గుంత పక్కన ఉన్న మట్టి రోడ్డు

# మళ్లీ ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ



ఎంపీడీఓ కార్యాలయం వద్ద దరఖాస్తు చేసేందుకు వచ్చిన లబ్ధిదారులు

**నేలకొండపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో భాగంగా ప్రజాపాలన కేంద్రాల ఏర్పాటుకు మంగళవారం శ్రీకారం చుట్టింది. ఎన్నికల కోడ్ ముగియడంతో తాజాగా ప్రజాపాలన కేంద్రాలను అధికారులు పునఃప్రారంభించి గృహజ్యోతి(జీరో విద్యుత్ బిల్లు), రూ.500 లకే వంటగ్యాస్ పథకాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. గతంలో ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు అందించగా.. లబ్ధిదారుల పొరపాట్లతో పాటు ఆన్‌లైన్ చేసే సమయాన రేషన్ కార్డులు, గ్యాస్ నంబర్లు తప్పుగా నమోదు కావడం తదితర సాంకేతిక కారణాల వలన పథకాలు వర్తించక లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. వీటిని పునఃపరిశీలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. దీంతో మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు తరలివస్తుండడంతో ఎంపీడీఓ ఎం.యర్రయ్య ప్రత్యేకంగా కుర్చీలు ఏర్పాటు చేసి వారికి ఇబ్బందులు లేకుండా తగిన సౌకర్యాలు కల్పిస్తున్నారు. కాగా, రోజుకు 60 మంది దరఖాస్తులు మాత్రమే స్వీకరిస్తున్నారు.

# ఐసీడీఎస్ ఎదుట ఏఐటీయూసీ ధర్నా

**కామేపల్లి:** అంగన్‌వాడీ కార్యకర్తలందరికీ రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.10 లక్షలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించని బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపామని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం అంగన్‌వాడీ కార్యకర్తలకు రూ.18 వేల వేతనాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. గత రెండేళ్లుగా పెండింగ్‌లో టీఏ, డీఏలను కూడా ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలని, పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఐసీడీఎస్ సీడీపీఓ దయామణికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మేరి, ఆదిలక్ష్మి, లక్ష్మమని, ఝాన్సీ, అనసూర్య, లక్ష్మి, మరియమ్మ, బసవమ్మ, అమృత, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



సీడీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

# ● ఆహ్లాదం.. ఆకర్షణీయం!



రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పచ్చని చెట్లు ఉండడంతో ఈ దారి గుండా ప్రయాణించే సమయాన ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. ఫారెస్ట్‌లో ప్రయాణం చేస్తున్నట్లుగా ఇదిగో ఇలా ఉంటుందగా.. ఇంతటి ఆహ్లాకరమైన రహదారి నేలకొండపల్లి-కూసుమంచి రహదారిలోని కోనాయిగూడెం వద్ద నెలకొని ఉంది. దాదాపు కిలో మీటరు వరకు ఇలా పచ్చగా ఉండడంతో వేసవిలో చెట్ల కింద సేదదీరేందుకు ప్రయాణికులు ఆసక్తి కనబరుస్తున్నారు. - నేలకొండపల్లి

### పైపులైన్‌కు మరమ్మతులు..

సాక్షి ఎఫెక్ట్..



మరమ్మతులు చేస్తున్న జీపీ సిబ్బంది

**కామేపల్లి:** మండలంలోని నెమలిపురి సక్రుతండా గుంపుకు గత 15 రోజులుగా పైపు లైన్ మరమ్మతుల కారణంగా తాగునీటి సమస్య ఎదుర్కొంటున్న అంశంపై 'తాగునీటి సమస్య తీర్చండి'అనే శీర్షికన సోమవారం 'సాక్షి'దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో ఎంపీడీఓ రవీందర్ ఆదేశాలతో జీపీ కార్యదర్శి కోటేశ్వరరావు పైపులైన్‌కు మరమ్మతులు చేయించి నీటి సరఫరాకు అంతరాయం లేకుండా వినియోగంలోకి తీసుకొచ్చారు.

### 'ఎస్‌బీఐటీ' విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న చైర్మన్, తదితరులు

**ఖమ్మం సహకారనగర్:** రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో తమ విద్యార్థి కె.అఖిల్ ద్వితీయ బహుమతి గెలుచుకున్నాడని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఓపెన్ కేటగిరీల్లో 66 కేజీల విభాగంలో అఖిల్ సత్తా చాటగా.. మంగళవారం విద్యార్థిని చైర్మన్ అభినందించారు. ఈకార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జి.ధాత్రి, డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, ఏ.వీ.వీ.శివప్రసాద్, జి.ప్రవీణ్‌కుమార్, జె.రవీంద్రబాబు, ఎస్.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కె.అమిత్ బింధాజ్ పాల్గొన్నారు.

### గ్రామ దేవతలకు జలాభిషేకం



జలబిందెలతో వస్తున్న మహిళలు

**కామేపల్లి:** మండలంలోని ముద్దులపల్లి గ్రామంలో మంగళవారం గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. మేళతాళాలతో మహిళలు జలబిందెలతో ఊరేగింపుగా తరలివచ్చి గ్రామంలోని బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లికి జలాభిషేకం చేశారు. వర్షాలు సకాలంలో కురవాలని, పంటలు సమృద్ధిగా పండాలని కోరుకుంటూ మొక్కులు చెల్లించుకున్నారు.

# అన్నింటా 'ఆదర్శ్'నీయుడు



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ పునుకొల్లు నీరజ

ఆదర్శ్ సురభి వీడ్కోలు సభలో వక్తలు

**ఖమ్మంమయూరిసెంటర్:** ఖమ్మం మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అన్ని విభాగాలను సమన్వయం చేస్తూ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, పరిపాలన ఇలా అన్నింటిలోనూ ఆదర్శ్ సురభి తనదైన ముద్ర వేశారని మేయర్ పునుకొల్లు నీరజ, ఎస్‌ఈ రంజిత్‌కుమార్, ఎంఈ కృష్ణాలాల్, ఏఎంసీ సంపత్‌కుమార్ కొనియాడారు. పదోన్నతిపై వనపర్తి జిల్లా కలెక్టర్‌గా వెళ్తున్న కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభిని మంగళవారం కేఎంసీ కార్యాలయంలో ఘనంగా సత్కరించి.. వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. కరోనా కష్టకాలంలో వ్యాక్సిన్లు వేయించడం, వరదల సమయంలో ముంపు బాధితులను కాపాడడం, కేఎంసీకి ఘనమైన ఆదాయాన్ని సమకూర్చడం, నగర సుందరీకరణ, పార్కుల నిర్మాణం వంటి పనులను ఎవరినీ నొప్పించకుండా తనదైన శైలిలో ఖమ్మం అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. మరోసారి జిల్లా కలెక్టర్ హోదాలో ఖమ్మంకు రావాలని ఆకాంక్షించారు. అనంతరం ఆదర్శ్ సురభి మాట్లాడుతూ.. అందరి సహకారంతో ప్రతీ పనికి లక్ష్యాలను నిర్దేశించుకొని విజయాలు సాధించామన్నారు. కమిషనర్‌గా పని చేసిన తనకు సహకరించిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు, నగర వాసులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కమర్తపు మురళి, మలీదు జగన్, మగ్బూల్, తహసీల్దార్ స్వామి, అకౌంట్స్ ఆఫీసర్ శివలింగం, ఆర్వో జి.శ్రీనివాస్, డీఈలు ధరణి, మాధవి, నవ్య జ్యోతి, ఏసీపీ వసుంధర, అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొని కమిషనర్‌ను శాలువాలు, బొకేలతో సత్కరించారు.



ఆదర్శ్ సురభిని సన్మానిస్తున్న మేయర్, కార్పొరేటర్లు, అధికారులు

# కళల కోసం పరితపించిన వ్యక్తి 'వేగినాటి'

**ఖమ్మంరూరల్:** ప్రజా కళల కోసం పరితపించే వ్యక్తి, ప్రజా నాట్యమండలి సీనియర్ నాయకుడు వేగినాటి వెంకటేశ్వర్లు అని ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నామాల లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం వెంకటేశ్వర్లు ప్రథమ వర్ధంతి సందర్భంగా మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్‌లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించిన సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడారు. ప్రజా నాట్యమండలి అభ్యున్నతి కోసం, జీవితాంతం కృషి చేసిన కళా కార్మికుడు వేగినాటి సేవలు అనిర్వచనీయమని, ప్రజలు ఎదుర్కొంటున్న అనేక రుగ్మతలను తనదైన శైలిలో ఆటపాటల ద్వారా ప్రజలను చైతన్య పరిచిన మహోన్నత వ్యక్తి అని ప్రశంసించారు. ఆయన ఆశయ సాధనకు నేటి కళాకారులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం. కొండల్‌రావు, పి.సంగయ్య, రామయ్య, వీరబాబు, ఎ.లింగయ్య, ఎస్.రాంబాబు, లింగయ్య, లెనిన్, సత్యం తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న లక్ష్మీనారాయణ, నాయకులు

# 21న పటేల్ స్టేడియంలో యోగా

**ఖమ్మంగాంధీచౌక్:** ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆధ్యాత్మిక వేత్తలు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని వర్తక సంఘం భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు మాట్లాడారు. యోగా, ధ్యానం, ఆయురారోగ్యాలు, ప్రేమానురాగాలు పొందటం, శాఖాహారం వలన కలిగే ప్రయోజనాలు వంటి అంశాలపై ఈవెంట్స్‌ను నిర్వహించే విధంగా ప్రణాళిక రూపకల్పన చేశారు. ఈ సమావేశంలో సిద్దార్థ యోగా విద్యాలయం కన్వీనర్ పి.లక్ష్మీనారాయణ, పిరమిడ్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు కె.ఆనంద ప్రసాద్, శైలజ, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి కె.కోటేశ్వరరావు, ఎస్.సుధాకర్, పతంజలి యోగా సెంటర్ ప్రతినిధి టి.వెంకటరాములు, పీస్ యోగా సెంటర్ ప్రతినిధి జహీర్ అలీతో పాటు రమాదేవి, నాగేశ్వరరావు, వెంకట్, చంద్రశేఖర్, బాలరాజు, ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ సహాయ కార్యదర్శి మన్నెం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### యోగా దినోత్సవానికి జిల్లా జడ్జికి ఆహ్వానం

**ఖమ్మంలీగల్:** ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకని జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించే కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా మంగళవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్‌కు ఆహ్వానం అందించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం యోగ సంఘాల ప్రతినిధి కన్వీనర్ వంజాకుల లక్ష్మీనారాయణ, వరల్డ్ పీస్ రైట్స్ క్లబ్ ఫౌండర్, లాఫ్టార్ యోగ సేవా క్లబ్ ఫౌండర్ మరికంటి వెంకట్, శైలజ, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, కాశీన ఆనంద ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



జడ్జికి ఆహ్వాన పత్రం అందజేస్తున్న దృశ్యం

# అష్టలక్ష్మి దేవాలయ వార్షికోత్సవ వేడుకలు

**ఖమ్మంఅర్బన్:** నగరంలోని 12వ డివిజన్ పరిధిలో గల శ్రీ అష్టలక్ష్మి దేవాలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ చుట్టుపక్కల కాలనీలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున హాజరై సామూహిక కుంకుమ పూజ, కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో నగర మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్ చిరుమామిళ్ల లక్ష్మి–నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని మేయర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న మేయర్ నీరజ, తదితరులు

# పాలేరు అభివృద్ధికి మంత్రి పొంగులేటి కృషి

**కూసుమంచి:** వచ్చే ఐదేళ్లలో పాలేరు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కృషి చేస్తున్నారని కాంగ్రెస్ నాయకుడు, మంత్రి పొంగులేటి సోదరుడు పొంగులేటి ప్రసాదరెడ్డి అన్నారు. మంగళవారం కూసుమంచిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి నాయకులతో ఆయన సమావేశమయ్యారు. గ్రామాల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నాక పలు సమస్యలను పరిష్కరించాలంటూ అధికారులకు సూచించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణ పనులు, ఇతర మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ నాయకులు అధికారులను సమన్వయం చేసుకుంటూ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. పాలేరు రిజర్వాయర్‌కు సాగర్ జలాలపై ఆధార పడకుండా మున్నేరు నుంచి గ్రావిటీ కాలువను తవ్వడం ద్వారా తక్కువ ఖర్చుతో నీటిని మళ్లించి సమస్యను తీర్చవచ్చని ఇరిగేషన్ డీఈఈ రమేష్‌రెడ్డి ఈ సదర్భంగా ప్రసాదరెడ్డికి మ్యాపు ద్వారా వివరించగా దాన్ని అమలు చేసేందుకు మంత్రి పొంగులేటి కృషి చేస్తారని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పొంగులేటి ప్రసాదరెడ్డి